ఎక్కవలసిన రైలు

మధురాంతకం రాజారాం

పట్టపురాణి పురిటి నొప్పులవేళ శుభవార్త కోసం వేచి చూస్తున్న రాజాగారిలా శ్రీకంఠంగారు వరండాలో వెడ తిరిగేస్తున్నారు.

ముఖంలో చిరాకు, పెదవుల బిగింపులో కట్టుదల, అరమోడ్పు కళ్ళలో ఆందోళన—శ్రీకంఠం గారి తీరు విచిత్రంగావుంది.

అల్లంతదూరాన నేను కనిపించగానే ఆయన ముఖంలో ఆశాకిరణంలాంటిదేదో తళుక్కున మెరిసింది.

“వాయనా శేఖరం! వేయేళ్ళాయుష్షు నీకు! రా, కూర్చో” అంటూ బెంచి చూపించారు శ్రీకంఠంగారు. కూర్చోగానే చరచరా దగ్గరికివచ్చి ఏదో రహస్యం చెబుతున్నట్టుగా “చూడు శేఖరం! నీ స్నేహితుడి అంతర్యమేమిటో బుర్రచించుకున్నా బోధపడకుండా వుంది నాకు! వరుసగా నాలుగైదు సంబంధాలను గురించి వివరించి, ఫోటోలు గూడా చూపెడితే వీడు వులకకా, పలకకా గుండ్రాయిలా కూర్చుంటే నేనేమనుకోవాలి చెప్పు! అసలింతకూ వీడికి పెళ్ళి చేసుకునే వుద్దేశం వుందా లేదా శేఖరం?” అంటూ సూటిగా ప్రశ్నించారు.

“అబ్బే, పెళ్ళెందుకు చేసుకోడండీ! లేదంటే ప్రస్తుతానికి వ్యక్తిగతమైన అభ్యంతరాలేవైనా వుంటే వుండవచ్చు........” అంటూ నాకు తోచినంతలో ఓ కుంటి సంజాయిషీ తయారు చేశాను.

“వ్యక్తిగతమైన అభ్యంతరాలా? బాబ్బాబూ నీకు పుణ్యం ఉంటుంది. వాడేమో పెట్టె, పరుపూ సర్దుకుంటున్నాడు. అదిగో జట్కా గూడా వచ్చేస్తోంది. ఎలాగూ నువ్వూ సమయానికే వచ్చావు....”

“స్టేషనుదాకావెళ్ళి సాగనంపడానికే వచ్చాను. వాడి అభిప్రాయమేమిటో నిష్కర్షగా అడిగి తెలుసుకుంటాము........” అంటూ శ్రీకంఠంగారికి అభయమిచ్చాను.

అంతలో బూట్ల సవ్వడి వినిపించింది.

నీటుగా ముస్తాబై వెలుపలికి వచ్చిన కుమారుడి వైపు చూడనట్టే చూస్తున్నారు శ్రీకంఠంగారు. ఇప్పు డాయనవి అనిమిషనయనాలు. ఇప్పు డాయనది ప్రసన్నవదనం.

చేమంతి పువ్వుల ప్రోవులా పసిమి నిగ్గులతో మెరుస్తున్న ఆ కుర్రవాడు, పార్కులోని పూల మొక్కలా బొద్దుగా ముద్దుగావున్న ఆ పడుచువాడు ప్రయోజకుడై, పది రూకలార్జించడంతో పాటుగా గుణగణాలమూలంగా పదిమందిలో పేరెన్నికగన్న ఆ యువకుడు — కన్నతండ్రి కన్నులకు విందుగా కాసేపు వరండాలో నిల్చున్నాడు.

జట్కా సాయిబు పెట్టె పరుపూ బండిలోకి చేరవేసి, “ఎక్కికూచోండి బాబయ్యా” అన్నాడు.

“వెళ్ళొస్తాను నాన్నా!” అన్నాడు కుమారుడు.

“వెళ్ళిరారా సాత్యకీ! వెళ్ళగానే జాబు రాస్తావు గదూ! అన్నట్టు రాబోయేది చలికాలం. వేడినీళ్ళు త్రాగడం మంచిది. నువ్వేమిటో, నీ పనేమిటో అంతేగానీ, వాళ్ళతో వీళ్ళతో చేరి వృథా కాలక్షేపాలు పెట్టుకోవద్దు........”

“అలాగే నాన్నా!” మెట్లు దిగసాగాడు సాత్యకి.

“రేపొకసారి కనిపిస్తావా శేఖరం” అంటూ హెచ్చరించారు శ్రీకంఠంగారు.

“తప్పకుండా కనిపిస్తానండీ” అన్నాను.

జట్కాబండి కదిలింది.

కదిలిన జట్కా గేటు దాటుకుని తారురోడ్డుపై పరుగిడుతోంది.

“అదికాదురా సాత్యకీ! ఆరుమాసాల కొకసారి ఇంటికి వచ్చి వెళ్ళేవాడివి — అలా వచ్చినప్పుడైనా ముసలాయన మనసు కింత సంతృప్తిని చేకూర్చి వెళ్ళగూడదా?” నొచ్చుకున్నట్టుగా ప్రశ్నించాను.

“ఇప్పుడు నేనేమైనా ఎబ్బెట్టుగా ప్రవర్తించానా శేఖరం?” విస్మయంతో అడిగాడు సాత్యకి.

“లేకపోతే ఈ ముసుగులో గుద్దులాట లెందుకురా సాత్యకీ? ఆ వివాహమన్న విషయంపట్ల, నీ అభిప్రాయమేమిటో నిక్కచ్చిగాతేల్చి చెప్పగూడదూ” అన్నాను.

సాత్యకి ముఖం వెలవెలబోయింది. పెదవులు కొంచెంగా వణికాయి గూడా! ఒకటి రెండు క్షణాలు అలాగే నావైపు కొరకొర చూసి, “అలాగైతే నేనిలా సుఖంగా వున్నందుకు నీకు గూడా మనసొప్పడం లేదన్నమాట!” అన్నాడు సాత్యకి.

ఈసారి తెల్లబోవలసిన వంతు నాకే వచ్చింది.

“నాన్నగారిమాటలటుంచి, నువ్వయినా సన్నర్థం చేసుకోలేవా శేఖరం? నాకింకా పాతికేళ్ళు నిండలేదు. జీవితంలో మొట్ట మొదటి అయిదేళ్ళు బాల్యం. ఆపైన పూర్తిగా ఒకటిన్నర దశాబ్దం చదువు. రెండేళ్ళు నిరుద్యోగం. ఉద్యోగంలో చేరి రెండేళ్ళు కాలేదు. మొదటి తేదీనాటి సాయంకాలానికి నూట యిరవై అయిదు రూపాయలు చేతిలోకొస్తే మొదటి వారం ముగిసేసరికి నా జేబు ఖాళీ అయిపోతుంది. తన కాళ్ళపైన తాను నిలబడవచ్చునన్న నమ్మకమైనా లేనివాడికి పెళ్ళెందుకు శేఖరం? తాను తూగడానికే సందు లేకపోతే యింక మెడకొక డోలు గూడానా! వద్దు బాబూ వద్దు. నా కిప్పుడెంతో హాయిగావుంది. పెళ్ళి అన్న ఆ పొరబాటు కాస్తా జరిగిపోయిన తర్వాత ఇం కాయింత హాయిగా, యింత విశ్రాంతిగా గడచిపోవడానికి వీలుంటుందా శేఖరం? ఉండదు. ఉండనే ఉండదు. ఎన్ని అవసరాలు, ఎన్ని అభ్యర్థనలు, ఎంత అలజడి! అమ్మో, ఆ దురవస్థను తలచుకుంటేనే నాకు భయంగా ఉంటుంది. నువ్వు నూరు చెప్పు, వెయ్యి చెప్పు— ఉద్యోగంలో ఒకటి రెండు ప్రమోషన్లు లభించి, ఈ ఓటి జీవితానికి గట్టి పునాదు లేర్పడేదాకా నేను పెళ్ళిమాట తలపెట్టను......”

ఇదివరకెప్పుడో ఒక పెళ్ళాంతో కాపురం చేసినంత అనుభవజ్ఞానంతో సాత్యకి వెల్లడించిన అభిప్రాయాన్ని విన్నమీదట నే నించుమించుగా స్తబ్ధుడనైపోయాను. అంతటి వివేకవంతుడితో వాగ్వాదానికి పూనుకుని వాడి వాదాన్ని పూర్వపక్షం చేయడం సులభసాధ్యంకాదని నాకు తెలుసు. ఎదుటివాడు మరీ అంతటి మందమతి అయితే తప్ప— ఇంతకంటే విశదీకరించవలసిన అవసరం లేదన్నట్టుగా పరుపుచుట్టపైకి ప్రాలిపోయి, కాళ్ళు చాపుకుని సాత్యకి జట్కాలోనే ‘అనంతశయనం’ సవరించేశాడు.

ఇంతకూ సాత్యకి త్వరగా పెళ్ళిచేసుకున్నందువల్ల నాకు కలగబోయే ప్రయోజనంగానీ, వాడి పెళ్ళి విషయంలో ఆలస్యం జరిగితే నాకు వాటిల్లే నష్టంగాని ఏమీలేదు. నాకు కావలసిందల్లా వాడి అభిప్రాయం—అదే శ్రీకంఠంగారితో విన్నవించుకోవడానికి! వాడి అభిప్రాయం ఎలాగూ తెలిసిపోయింది గనుక, అంతటితో ఆ ప్రసక్తిని కట్టిపెట్టడమే సమంజసమనుకున్నాను.

ఉన్నట్టుండి జట్కాబండి ఆగిపోవడంతో ఆలోచనల గొలుసుకట్టు పుటుక్కున తెగిపోయి ఎదుట రైల్వే స్టేషను ప్రత్యక్షమైంది. సామానును ప్లాట్‌ఫారంపైకి చేరవేసి జట్కా సాయిబు సెలవు తీసుకున్నాడు. రైలు స్టేషనులోకి రావలసిన నిర్ణీత సమయాని కింక పది నిమిషాలకన్నా వ్యవధి లేదు. సాధారణంగా ఆవేళప్పుడు స్టేషను పెళ్ళివారిల్లులా సందడికి నిలయమై వుండడం చూస్తాము. ఇప్పుడైనా జనసమ్మర్దం తక్కువగా లేదుగానీ, ఆవున్న జనంలో ప్రయాణోత్సాహంగానీ, యాత్రా సందడిగానీ లీలగానైనా కనిపించడంలేదు! రైల్లో ప్రయాణం చేయడంకన్నా రైలుకోసం వేచి చూడడమే ఆనందకరమనుకున్నట్టుగా వాళ్ళెక్కడివాళ్ళక్కడ ప్లాట్‌ఫారంపైనే బిచాణా సర్దుకున్నారు. దుప్పట్లు కప్పుకున్నారు!

వాకబు చేయగా తెలిసింది—ఏడు గంటల రైలు తొమ్మిది పదిహేనుకుగానీ స్టేషనుకు రాబోవడం లేదని!

సాత్యకి దిగాలుపడిపోయాడు. “చూశావా శేఖరం! నే నెప్పుడు బయల్దేరినా యింతే!” అంటూ బుంగముఖం పెట్టేశాడు.

“ఓపినంత జీవితం ముందరుండగా ఈమాత్రం విపర్యయానికే తట్టుకోలేకపోతే ఎలాగురా సాత్యకీ! ఐనా రెండు గంటలంటా ఎంత? ఈ చివరినుంచి ఆ చివరిదాకా ప్లాట్‌ఫారంపైన నాలుగుసార్లు పచార్లు చేసేసరికి రెండు గంటలు రెండు నిమిషాల్లా గడచిపోవూ!”

—విచిత్రమైన మనిషి సాత్యకి. తనను సాగనంపడానికి వచ్చిన నేరానికి రెండు గంటలసేపు స్టేషనులో పడిగాపులు పడబోతున్నందుకు నాపైన యించుక సానుభూతి ప్రకటించాలన్న స్పృహ గూడా వాడికి లేకపోయింది. మిదుమిక్కిలి రైలు రావడంలో వాటిల్లిన విలంబనానికి నేనే పూచీదారునైనట్టు వాడికి నేను క్షమాపణలాంటి సంజాయిషీ చెప్పుకోవలసి వచ్చింది!

చలికాలపు రోజులు. ఎత్తయిన పడమటికొండ చాటున ఆరుగంటలకే సూర్యుడస్తమించాడు. సూర్యుడస్తమించిన కొద్ది నిమిషాలకే చీకట్లు చిమ్మనగ్రోవితో చిమ్మినట్లు లోకాన్ని క్రమ్ముకున్నాయి. ఏడుగంటలకల్లా రోదసీకుహరం అంధకారబంధురమైపోయింది. ప్లాట్‌ఫారం పొడుగునా విద్యుద్దీపాలు వెలుగుతున్న మాట నిజమే! కానీ దీప కాంతుల కడ్డంగా చెట్లు కొన్ని దట్టమైన నీడలు పరచుకుని నిమ్మళంగా నిలిచి వున్నాయి. చెట్లు లేనిచోట అటూ యిటూ తిరుగుతున్న మానవాకారాలు వెలుగును చీల్చి చిందర వందర చేస్తున్నాయి. అడివిలాంటి అంధకారంలో, కోయవాళ్ళు వేసుకున్న సెగళ్ళలా భాసిస్తున్న వెలుగుల కడ్డంగా పడి యిది వరకు నేను సూచించినట్టుగా మే మిద్దరమూ

—45వ పేజీ చూడండి

ఎక్కవలసిన రైలు

17-వ పేజీ తరువాయి

ప్లాట్‌ఫారమ్మీద పచార్లు ప్రారంభించేశాను. ఆఫీసులో అధికారిగారి ముఖ భంగిమనుబట్టి అతడి యింట్లో అమ్మగారి ధోరణిని ఊహించవేర్చిన తన సహోద్యోగి బుద్ధిచాతుర్యం దగ్గరినుంచీ మొదలు పెట్టి రకరకాలైన తన ఉద్యోగానుభవాలను గురించి ఏకరువు పెడుతున్నాడు సాత్యకి.

ఉన్నట్టుండి సాత్యకి వాక్ప్రవాహం ఆగిపోయింది. "ఎవరో పిలుస్తున్నట్టున్నారు" అంటూ అతడు ఆగిపోయాడు.

"ఎవరిని?" అంటూ వెనుదిరిగి చూశాను.

"నిన్నేనోయ్ శేఖరం!" కానుగచెట్టు క్రింది నుంచీ పిలుపు వినిపించింది.

నీడలో ఆకృతి సరిగ్గా కనిపించడంలేదు. ఐనా ఆ గొంతుక నాకు బాగా గుర్తు. పిలుస్తున్న వ్యక్తి ఉమాపతిగారు.

"ఎందాకా బయల్దేరావు శేఖరం! రా, వచ్చి కూర్చో. రైలు రావడంలో ఆలస్యం జరిగినందుకు కాదుగానీ, యిక్కడొక పలుకు తోడులేకపోయినందుకు నాకు చాలా యిబ్బందిగావుంది. ఇంతసేపటికి నువ్వు కనిపించావు. అన్నట్టు నిన్ను నీడలా అంటిపెట్టుకునివున్న అబ్బాయి ఎవరు శేఖరం?"

"అదేమిటండీ మేష్టరుగారూ! మీ శిష్యుణ్ణే గుర్తుపట్టలేరా మీరు! ఈమధ్య వీడు కాస్త కొవలు పెంచి వసలు తొడిగిన మాట వాస్తవమే! కాని పోల్చుకోడానికి వీల్లేనంతగా వీడిలో మార్పొచ్చిందంటే నేను నమ్మలేను......" అన్నాను.

ఉమాపతిగారు ఒకటి రెండు క్షణాల్లో సాత్యకిని గుర్తుపట్టేశారు — "ఓహో! శ్రీకంఠంగారి అబ్బాయిగదూ! ఎంతవాడివయ్యావురా సాత్యకీ! నిండుచెరువులో నీళ్ళే లేదన్నట్టుగా వీడిలో మార్పు లేదంటావేమిటి శేఖరం? డస్కులో కూర్చుంటే తల పైకి కనిపించేదిగాదు. క్లాసుకేగాదు, స్కూలుకంతా పొట్టివాడు సాత్యకి. పొట్టివాడికి పుట్టెడు బుద్ధులంటారు గనుక "ఒరే పుట్టెడు బుద్ధులూ!" అని నేను సాత్యకిని ముద్దుగా పిలిచేవాణ్ణి. నిన్న గాక మొన్ననే జరిగినట్టున్నా, అది పదేళ్ళనాటిమాట! అన్నట్టు యిప్పు డెక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? ఏం కథ!" అంటూ ఒక్కుమ్మడిగా పాత శిష్యుణ్ణి పరామర్శించేశారు ఉమాపతిగారు.

"వాడికేమండీ! అదృష్టవంతుడు. లక్షణమైన ప్రభుత్వోద్యోగం. సత్రంలోకాదుగానీ హోటల్లో భోజనం. మఠంలోకాదుగానీ గదిలో ఒంటరిగా నివాసం. వాడి సంపాదన వాడికి సరిపోతే చాలుననుకునే తల్లిదండ్రులు. ఇన్ని సదుపాయాలకు తోడుగా—'చుట్టాలు, శత్రువులు, స్నేహితులు, ఋణస్తులు. కనుక మానవ సమాజంతో సన్నిహిత సంబంధాలు అనవసరమేగాక అపాయకరం గూడా' ననుకునే మనస్తత్వం మీ శిష్యునిది. ఇక ప్రపంచంలో వీడి జీవనయాత్రకు ఢోకా ఏముంటుందండీ మేష్టరుగారూ!"

"అలాగా! అయితే సాత్యకి ప్రయోజకుడైపోయాడన్నమాట!"—అంటూ నిండుగా నవ్వేశారు ఉమాపతిగారు. నవ్వుతూ "ఇంతటి బుద్ధిమంతుణ్ణి జామాతగా స్వీకరించడానికి ఆడపిల్లలనుగన్న తల్లిదండ్రులు పోటీలకుపైన పోటీలుగా యింకా రంగంలోకి దిగలేదా శేఖరం?" అని ప్రశ్నించారు.

ఈ ప్రశ్నతో కథ మళ్ళీ ఎక్కడైతే బయుల్దేరిందో అక్కడికే వచ్చిచేరింది!

"నా పెళ్ళిని గురించి నాకులేని తొందర లోకానికెందుకండీ మేష్టరుగారూ?" ఇంచుక విసురుగానే ప్రశ్నించాడు సాత్యకి.

"ఎందుకంటావా సాత్యకీ! చెబుతాను విను—" అంటూ నింపాదిగా ప్రారంభించారు ఉమాపతిగారు. "మానవుడు సంఘజీవి. వివాహం ఒక సాంఘిక నియమం. ప్రతి మానవుడూ ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా శిరసావహించవలసిన సాంఘిక నియమం వివాహం. ఆ వివాహమన్న సాంఘిక నియమం ఓ రైలులాంటిదనుకో సాత్యకీ! ఒకప్పుడు నీ అంతట నువ్వుగా ఆ రైలును వదిలేస్తే మరొకప్పు డది

కోడిని దొంగిలించాడనే ఆరోపణపై ఒక వ్యక్తిని న్యాయస్థానంలో విచారిస్తున్నారు. నిందితునకు అనుకూలంగా పది మంది, వ్యతిరేకంగా ముగ్గురు సాక్ష్యం చెప్పారు.

"నిందితునకు అనుకూలమైన సాక్ష్యం ఎక్కువగా ఉన్నది కనుక కేసు కొట్టివేస్తున్నాను." అని న్యాయమూర్తి తీర్పు చెప్పి, నిందితుని విడిచి పెట్టాడు.

ఎం. కామేశ్వరరావు, (మద్రాసు)

నువ్వందుకోవాలన్నా అందకుండా స్టేషను దాటిపోతుంది. ఆవిధంగా రైలుదప్పిన ప్రయాణీకులు సంఘంలో కోసికొయ్యల్లా మిగిలిపోయి జీవితంలో తీరిగ్గా విచారిస్తూ కూచోవలసి వస్తుంది......"

తమలపాకుతో ఆడబోయిన సరసానికి తలుపు చెక్కతో పరిహారం లభించినట్టైన సాత్యకి నిర్ఘాంతపోయాడు.

మా ముగ్గురి నడుమ ఒక నిమిషం నిశ్శబ్దంగా గడచిపోయింది.

"చూడండీ మేష్టరుగారూ! మీరు వివాహానికి సంబంధించిన మీ సిద్ధాంతాన్ని వీలైనంత సంగ్రహంగా చెప్పేశారు. మరికొంత వ్యాఖ్యానం అవసరమేమోనని నా అనుమానం......" అంటూ సాభిప్రాయంగా ఉమాపతిగారివైపు చూచాను.

కానుగచెట్టు మొదలుకి చేరగిలబడి కూర్చున్న ఉమాపతిగారు కాస్త ముందుకు జరిగి నిటారుగా కూర్చుంటూ "వ్యాఖ్యానించటంకాదుగానీ, ఓ కథ చెబుతాను వింటావా శేఖరం!" అన్నారు.

"అంతకంటేనా మేష్టరుగారూ! కథలంటే నాకు చాలా యిష్టం!" అన్నాను.

"కథలంటే నాకు అయిష్టం! మీరు మీ సిద్ధాంతాన్ని బలపరచుకోడానికి ఓ కథను కల్పించి చెబితే నే నొప్పుకోను......" అన్నాడు సాత్యకి.

"కల్పితమైతే ఒప్పుకోవు. కాని నిజమైతే ఒప్పుకోక ఏంచేస్తావు సాత్యకీ! ఐనా యిప్పటికిప్పుడు ఓ కథను కల్పించి చెప్పడానికి నేనేమీ కథకుణ్ణి కాదు గదా! కాదని నీకు తెలును. ఇప్పుడు నేను నీకు చెప్పదలచుకున్నది మా చలపతిని గురించి. మా ఆవిడకు పినతండ్రి కుమారుడు గనుక వాడు నాకు వేలు విడిచిన బావమరిది. నేను వాడిని గురించిన వర్తమానాలను విని అయిదేళ్ళయింది. గడచిన అయిదేళ్ళలో వాడేంచేశాడో, ఎక్కడున్నాడో నాకు తెలియదు. హఠాత్తుగా ఈరోజు ఉదయం వాడి దగ్గరినుంచీ నా కొక ఉత్తరం వచ్చింది. తా నీ రైల్లో అనంతపురం వెళ్తున్నాననీ, స్టేషనుకువచ్చి తనను కలుసుకోవలసిందనీ ఉత్తరంలో వాడు మరీ మరీ ప్రాధేయపడుతూ వ్రాశాడు. ఉత్తరం జేబులో వుంది. మనిషి రైల్లో రానున్నాడు. నా కథ నిజమని నమ్మడానికి ఈ రెండు ఋజువులు చాలవా సాత్యకీ!"

నిస్సహాయకరమైన పరిస్థితిలో పడినవాడిలా సాత్యకి నిరుత్తరుడై కూర్చున్నాడు. ఉమాపతిగారు చెప్పసాగారు—

"ముప్ఫయిరెండేళ్ళవాడు చలపతి. వాడి ప్రస్తుత నివాసం బెంగుళూరు. అయిదారేళ్ళనుంచీ మా బంధులోకానికి సంబంధించినంతవరకూ అజ్ఞాతంగా వుండిపోయిన చలపతి అంతకుముందు మా కుటుంబానికెంతో సన్నిహితుడు. అంగిట బెల్లమూ, ఆత్మలో విషమూ వుంచుకున్నట్టు తోచిన ప్రతి వ్యక్తినీ శత్రువుగా పరిగణించి, నచ్చని మాటను వెంటనే ఖండించి, ఎట్టి క్లిష్ట పరిస్థితిలోనైనా ఆదర్శాలకంటిపెట్టుకుని లేని చిక్కుల్ని జీవితంలోకి కొని తెచ్చుకుంటూ మొండిగా బ్రతకడానికి అలవాటుపడిన దురదృష్టవంతుడు చలపతి. కుటుంబానికి వాడు జ్యేష్ఠుడు. గతంనుంచీ గుణపాఠాలు నేర్చుకోక, భవిష్యత్తును గురించి తలపెట్టక వర్తమానంలో కాళ్ళు చాపుకుని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే బద్ధకస్తులైన తల్లిదండ్రుల నిరవాకంలో ఆ కుటుంబం ఏనాడో చితికిపోయింది. మిగిలిన స్థిరాస్తి ఓ తాటాకులపాక. మిగిలిన చరాస్తి దోసపాదులాంటి సంతానం. వాళ్ళ దొక కుగ్రామం. ఆ ఊరికి రెండు మైళ్ళ దూరంలోగానీ, ప్రాథమిక పాఠశాలలేదు. ఏడు మైళ్ళదూరంలోగానీ హైస్కూలులేదు. అటువంటి కుటుంబంలో పుట్టి, అలాంటి పరిస్థితుల మధ్య పెరుగుతూ చలపతి స్కూల్‌ఫైనల్‌దాకా చదువుకోగలిగాడంటే అందుకు అతడి పట్టుదల ఒక్కటి తప్పితే మరొక్క దోహదం కనిపించదు. బండరాళ్ళ మధ్య నెరియలో రావిచెట్టు పుట్టి పెరగడంలేదా శేఖరం! ఆ రావిచెట్టులాంటివాడు చలపతి. ప్రతిరోజూ ఏడుమైళ్ళదూరం నడిచి అతడు హైస్కూల్లో చదువుకున్నాడు. పరీక్షలో వచ్చిన మార్కులే అతనికి ట్రెయినింగ్ స్కూల్లో సీటును సంపాదించి పెట్టాయి. పద్దెనిమిది రూపాయల వెలనరి స్టయి

ఫండుతో అతడి జీవితంలో రెండేళ్ళు ఇట్టే దొర్లిపోయాయి.

మరుసటి సంవత్సరం అతడు ఉపాధ్యాయుడుగా కొత్త జీవితం ప్రారంభించాడు.

ఏ పాఠశాలలోనైతే చలపతి ఉపాధ్యాయుడుగా చేరాడో ఆ పాఠశాల మేనేజరు పేరు శంకరయ్యగారు. ఊరికి దూరంగా ఉన్నతమైన ప్రహరీ గోడల నడుమ ఐదెకరాల పొలంలో పాకలు వేయించుకుని, నివాసంకోసం ఓ పెంకుటిల్లు నిర్మించుకుని అదొక చిన్న రాజ్యంగా, ఆ రాజ్యానికి తానే నిర్మకుట చక్రవర్తిగా జీవించేస్తున్న శంకరయ్యగారు చలపతిని దగ్గరికి చేరదీసి అతనికి తన రాజ్యంలో ఉచిత పౌరసత్వం ప్రసాదించారు. భోజనం, నిద్ర, ఉద్యోగం, విశ్రాంతి సర్వేసమస్తం అక్కడే జరిగిపోగలవు గనుక చలపతి కింక మిగిలిన ప్రపంచాన్ని గురించిన ప్రసక్తి పొత్తిగా అనవసరమన్నారు.

ఎంతటి చిన్న పని చేసినా, అందుకొక పెద్ద ప్రయోజనాన్ని ఆశించే దూరాలోచనాపరులు శంకరయ్యగారు. స్వప్రయోజనంకోసం ఆయన చేసినన్ని అవకతవక పనులు ఈయిలాతలంపైన మరెవ్వరూ చేసివుండరు. తోటి మానవుల మనోదౌర్బల్యం పట్ల ఆయనకు నమ్మకం ఎక్కువ. ప్రేలెత్తి తప్పును చూపెట్టగలిగేవరకూ ఆయన మనుష్యుల్ని దగ్గరకు తీసి తలపైకెక్కించుకునేవాడు. తప్పు కనిపించిన తర్వాత నానా హింసలతో వాళ్ళను ముప్పతిప్పలు పెట్టేవాడు. ఆహింసాకాండకు తట్టుకోలేక పారిపోయినవాళ్ళు పారిపోగా మిగిలినవాళ్ళు ఆయన దయా దాక్షిణ్యాలపైన ఆధారపడి కుక్కిన పేనుల్లా పడివుండేవారు.

అలాంటి కుక్కిన పేనుల్లో ఒకమ్మాయిపేరు సావిత్రి.

పదరు సావిత్రిని చలపతికి కట్టబెట్టదలచుకున్నారు శంకరయ్యగారు.

ఆయన తన ఉద్దేశాన్ని వీలైనంత స్పష్టంగా చలపతితో చెప్పేశారు. అంతటితో ఊరుకోకుండా తామలా ఉద్దేశించడానికి కారణాలను గూడా విశదీకరించారు—స్వజనంతోనూ, స్వకుటుంబంతోనూ సంబంధాలు త్రెంచుకుని తన బ్రతుకు తెరువు తానే చూచుకున్న సమర్థురాలు సావిత్రి. ఆమెను వివాహమాడినవాడికి బంధువుల బెడద వుండదు. ఇహలోకంలో సుఖజీవనోపాధికి ముఖ్యంగా కావలసినది డబ్బు. సావిత్రి హైయ్యర్‌గ్రేడు పంతులమ్మ. ఆమెను పెళ్ళాడినట్టయితే ప్రతినెలా ఓ చెక్కును బ్యాంకులో మార్చుకున్నట్టుగా ఆవిడ జీతంరాళ్ళను జేబులో వేసుకోవచ్చు....

ఈ ప్రతిపాదన బయల్దేరిననాటినుంచీ శంకరయ్యగారి కుటుంబంలో చలపతి స్థానం విచిత్రంగా మారిపోయింది. అందాకా ఒక ఉద్యోగిగా, లేదా ఆశ్రితుడుగా భావించబడుతూ వచ్చిన చలపతి ఒక్కపెట్టున బంధుసత్తముడైపోయాడు. 'సావిత్రిని అక్కయ్యా అని పిలవడానికి అలవాటుపడిన పుత్రరత్నం' చలపతిని బావా అని వ్యవహరించసాగాడు. స్వయంగా సావిత్రి వాలకంలో సైతం అదొక రకమైన హావభావాలు విజృంభించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే చలపతిని చుట్టుముట్టివున్న వాతావరణంలోనుంచి వలపు పిలుపు వెలిసే

ఎక్కవలసిన రైలు

మాటలాలు వుండి వుండి రివ్వురివ్వున వీవసాగాయి.

కథ అలాంటి రసవత్తరఘట్టంలో వుండగా ఒకనాడు చలపతి నన్ను కలుసుకుని తన కర్తవ్యాన్ని గురించి సలహా అడిగాడు—"

పొట్లం విప్పి వక్కపొడి నోట్లో వేసుకుంటూ, "ఆ పరిస్థితిలో నువ్వయితే ఏమని సలహా యిచ్చేవాడివి సాత్యకీ?" అన్నారు ఉమాపతిగారు.

"నేనా! ఏమని సలహా యిచ్చేవాడినంటారా! ఎవరికైనాసరే, ఎప్పుడైనాసరే— నా సలహా ఒక్కటే! వివాహమంటే ఏమిటి? అది వూరకేవున్న ప్రాణానికి మానవుడు తెచ్చిపెట్టుకునే ఉపద్రవం." కుండబద్దలు కొట్టినట్టుగా అన్నాడు సాత్యకి.

ఒక పెద్ద ఉద్యోగికి వేల సంఖ్యలో తనకువచ్చే జీతం ఎలా ఖర్చయిపోతోందో అంతు పట్టలేదు. చివరకు ఒకరోజున ఖర్చుచేసే ప్రతి రూపాయకు లెక్క రాయాలని నిర్ణయించుకున్నాడు. కాని ఈ నిర్ణయం ఒక్కరోజు మాత్రమే అమలు అయింది. ఆ రోజు అతడు రాసిన ఖర్చులు ఇలా ఉన్నాయి. టాక్సీకి రు. 2; డ్రైవర్ కి టిప్ రు. 0-8-0; చిల్లర ఖర్చులు రు 40.

పి. ముకుందరావు, (శ్రీకాకుళం)

"కానీ జిహ్వకొక రుచి, పుర్రెకొక బుద్ధి కదటయ్యా సాత్యకీ! మీదుమిక్కిలి చలపతికి శ్రేయోభిలాషిని నేను! పుట్టినదాదిగా చలపతిని కష్టాలే వరించాయి. మోస్తున్నకొద్దీ ఆదర్శాల బరువు పెరిగేదే కానీ, తరిగేదికాదు. ఆదర్శాలు, సహనాలు, త్యాగాలు యిత్యాదులమూలంగా సుఖపడిన మానవుడు మన ఎరుకలో లేడు. తనకుమాలిన ధర్మం ఎవరి విషయంలోనైనా మొదలు చెడ్డ బేరమే! వివాహమన్నది మానవుడు తప్పనిసరిగా అందుకోవలసిన రైలు. అందుకోసమని ఎవరో ఒకరు తమ స్వంత ఖర్చులతో టికెట్టు కొనిపెట్టి సర్వ సౌఖర్య సముపేతమైన సెకండుక్లాసుపెట్టెలో ప్రయాణానికి వెరవు కల్పిస్తే, 'ఈ రైలు నాకొద్దు. నేనిప్పుడు బయల్దేరను' అనడం ఏం న్యాయం? న్యాయాన్యాయాల మాట దేవుడెరుగు! అలా నిరాకరించడం నిస్సందేహంగా మూర్ఖత్వమనిమాత్రం అనిపించుకుంటుంది.

"విన్నావా సాత్యకీ! ఇదీ నా సలహా! ఈ సలహాని సావధానంగా విన్నాడు చలపతి."

"విని ఏమన్నాడు?" సాత్యకి కుతూహలంతో ప్రశ్నించాడు.

"ఏమన్నాడు! తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళన్నాడు—'ఐతే నువ్వు చెప్పేదేమిటి బావా! నన్ను శంకరయ్యగారు విసిరిన వలలో తగులుకోమంటావా నువ్వు! బహుశా శంకరయ్యగారి మాటలో నిక్షిప్తమైన గూఢార్థం అవగతమై వుండదు నీకు! ఆయన ఏమన్నాడు? సావిత్రి అనే ఆ అమ్మాయికి స్వకుటుంబంతో సంబంధాలు లేవన్నాడు. ఆమెను పెళ్ళాడిన వాడికి బంధువుల బెడద వుండదన్నాడు. అంటే ఏమన్నమాట? ఆ పెళ్ళి సంబంధానికి ఒప్పుకున్నట్టయితే నేను నా వాళ్ళతో తెగతెంపులు చేసుకోడానికి సిద్ధంగా వుండాలన్నమాట! పోగా శంకరయ్యగారి మాటల్లో మనం జాగ్రత్తగా గమనించవలసిన అంశం మరొకటి వుంది. ఆయన అమ్మాయి అందచందాలను గురించి చెప్పాడుకాదు. గుణగణాలను గురించి చెప్పాడుకాదు. లేదంటే ఆమె సంపాదనాపరురాలనిమాత్రం ఆయన నొక్కి చెప్పాడు. ఆ సంపాదన ఆమెను పెళ్ళాడిన వాడికి దక్కుతుందన్నాడు. డబ్బు ఎవరికైనా అవసరమే! అలాగని నేను దానికోసం కక్కుర్తిపడలేను. ప్రతి అడుగుజాడా ఒక ఆత్మీయతాముద్రగా అర్ధాంగి జీవితోద్యానంలోనికి వసంతలక్ష్మిలా నడచిరావాలని చెబుతారు. జీవితం స్వగృహంలాంటిదైతే పెళ్ళికాగానే మగవాడు అందులో సగం వాటాను ఖాళీచేసి, అర్ధాంగికి యిచ్చుకోవలసి వుంటుంది. కేవలం డబ్బుకోసమని నేను నా జీవితంలో సగం వాటాని ఖాళీచేసి అద్దెకిచ్చుకోలేను. అమ్ముడు పోలేను. ! సలహాకొక నమస్కారం! అని తిరిగి చూడకుండ వెళ్ళిపోయాడు చలపతి......"

శ్రోతలమైన మేము కథను జీర్ణించుకోడానికి వీలుగా కాసేపు మౌనం వహించారు ఉమాపతిగారు.

"తరువాత ఏమైంది?" అని ఈసారి నేనే ప్రశ్నించాను.

"నిజం చెప్పాలిగదా శేఖరం! నాకు చలపతిపట్ల పట్టరానంత కోపం వచ్చింది. అతడు శంకరయ్యగారి సలహాను తోసిరాజన్నాడు. ఆ పరిసరాలు, పరిస్థితులు తనకు సరిపడటంలేదన్న సాకుతో ఉద్యోగానికి సైతం రాజీనామా యిచ్చాడు. మళ్ళీ తిరిగివెళ్ళి గచ్చపొదల పొదరిల్లులాంటి స్వకుటుంబంలో తగులుకున్నాడు. స్వగ్రామానికి దగ్గర్లో కొత్తగా ఏర్పాటైన ఒకానొక హైస్కూల్లో అతనికి ఉద్యోగం దొరికింది. తల్లిదండ్రులను సుఖపెట్టడంలోనుంచీ, తమ్ముళ్ళను చదివించడంలోకి వ్యాపించి, చెల్లెళ్ళకు పెళ్ళి చేయడందాకా విజృంభించి ఊపిరి త్రిప్పుకోడానికి వీల్లేకుండా ఆదర్శాల నాగపాశాలు అతణ్ణి పెనవేసుకున్నాయి. అమనిషిలపదుర్విదగ్ధుడి జీవితాని కిక సుఖశాంతులు లేవనుకోడంకన్నా అప్పుడు చలపతిని గురించి మరొక ఊహ నాకు తట్టనేలేదు......

అంతలో ఒక వార్త కర్ణాకర్ణిగా వినవచ్చి నాకు దిగ్భ్రాంతిని కలిగించింది.

ఓపినంత బాదరబందీని తలపైన వేసుకుని అంతటితో వూరుకున్నాడుగాదు చలపతి. అతడి ఆదర్శశీలానికి గిలిగింతలు పెట్టే సంఘటనలు అక్కడ

మళ్ళీ ప్రారంభమయ్యాయి. వెనుకా ముందూ చూడకుండా అతడొక ఘనకార్యం చేయడానికి తలపడ్డాడు. పేదవాడికోపం పెదవికి చేటైనప్పుడు పేదవాడి ఆదర్శం మాత్రం అతడి ముందరికాళ్ళకు బంధం కాదా సాత్యకీ! బంధమే! సంఘం మన చెప్పుచేతల్లోనిదిగాదు. సాంప్రదాయం ఈనాటిది గాదు. ఎవడిష్టం వచ్చినట్టు వాడు ప్రవర్తిస్తే అవి చూస్తూ వూరుకోవు. సంఘం చలపతిపైకి కత్తులు దూసింది. సాంప్రదాయం అతడిపైన నిప్పులు చల్లింది. పాఠశాల నిర్వాహకవర్గం అతడిపైన ఆంక్షలు విధించింది. అతడు నమ్మిన సత్యానికి అతడి కళ్ళ ఎదుటనే శృంగభంగం జరిగింది. తలపైన పిడుగు పడినట్టై అధోలోకాలలోకి కృంగిపోయాడు చలపతి. అతడి మనసు చెడిపోయింది. ఇంచుమించుగా అతడు పిచ్చివాడైపోయాడు........"

"ఇంతకూ చలపతి చేయబూనుకున్న ఘనకార్యం ఏమిటండీ మేష్టరుగారూ!" సాత్యకి ప్రశ్నలో ఉత్కంఠ ధ్వనించింది.

"ఏముంది? ఏది చేయగూడదో అదే చేశాడు చలపతి. అతడొక అమ్మాయిని ప్రేమించనే ప్రేమించాడు........"

"ప్రేమిస్తేనేం! అది తప్పా?" సాత్యకి ముఖంలో ఆశ్చర్యం!

"తప్పా, తప్పున్నరా! ఒళ్ళెరుగని శవమా సాత్యకీ! ప్రేమ గుడ్డిది అన్నారుబో కవులు! అంటేమాత్రం? కావ్యాలలోని సత్యాలు గవర్నమెంటువారి ఉత్తరవులా సాత్యకీ? కులాంతర వివాహానికి ఎవడొప్పుకుంటాడు? ఆ అమ్మాయిపేరు అమృత. చలపతి పని చేస్తున్న హైస్కూల్లో చివరి తరగతిలోవున్న విద్యార్థిని. వలచింది. వలపించుకున్నది. అదంతా పాలపొంగులాంటి భావోద్విగ్నత. ఒక అందమైన భ్రమ. ఒక తీయనైన కల. సహజమే మరి! ప్రేమికులకు వాళ్ళ మధ్యనున్న అగాధం ఓ చిన్న పిల్లకాలవలా కనిపిస్తుంది. ఆ పరస్పర వీక్షణాలు, ఆ ఊహారాగాలు, ఆ ప్రేమలేఖలు అవే వాళ్ళకు నిజమైన ప్రపంచమై, నిజమైన ప్రపంచం వాళ్ళ పాలిటికి అబద్ధమైపోతుంది. కానీ ఎంత కాలమైనా కలగంటూ కూర్చోడం సంభవమా సాత్యకీ? ఆ ప్రణయ వ్యవహారాన్ని లోకం పసిగట్టింది. అనతికాలంలోనే ఆ అమ్మాయి చదువుకు స్వస్తి చెప్పబడింది. వట్టు పట్టుమని పదివాళ్ళల్లోనే ఆ శుభకార్యం కాస్తా జరిగిపోయి ఆమె అత్తగారింటికి వెళ్ళిపోయింది......."

వేడిగా నిట్టూర్చాడు సాత్యకి.

"ఇంచుమించుగా చలపతి ఉన్మత్తుడైపోయాడని చెప్పానా సాత్యకీ! మాసిన దుస్తులు, పెరిగిన గడ్డం, చింపిరితల. ఆరు నెలల దేశ సంచారం. ఆ సంచారానికి చివర ఓ నెలరోజులపాటు అతడు మా యింట్లోనే వుండిపోయాడు. క్రమ క్రమంగా మామూలు మనిషయ్యాడు. మళ్ళీ ఒకచోట అతనికి ఉద్యోగం దొరికింది. తన జీవితంలో యిక ప్రేమకు చోటు లేదనేవాడు. కానీ వివాహమన్నది మానవుడి ముఖ్యావసరాల్లో ఒకటి. ఆప్తులందరూ పనిగట్టుకుని చలపతికి నచ్చచెప్పి పెళ్ళికి ఒప్పించి చివరికొక సంబంధాన్ని కూడా నిశ్చయం చేసేశారు......"

పరధ్యానంలో పడిపోయినట్టుగా ఉమాపతిగారు మళ్ళీ మౌనం సాధించసాగారు.

"చెప్పండి మేష్టరుగారూ!" బ్రతిమాలుకున్నట్టుగా అడిగాడు సాత్యకి!

"ఆ మూడో అమ్మాయి పేరు జలజ. పెళ్ళికిక వారం రోజుల వ్యవధి వుండనగా ఆ జలజ దగ్గర నుంచి చలపతి కొక జాబు చేరింది. జాబులో ఆమె తన హృదయం యిదివరకే ఒకరికి అర్పితమైపోయిందని సూచించి, ఆ అదృష్టవంతుడి నామధేయాన్ని గూడా పేర్కొని, అతని తోడిదే తనకు లోకమనీ, అలా జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమనీ ఉల్లేఖించింది. తీరా పెళ్ళి నాటికి చలపతి పత్తాలేడు. అతడు వంకీకి తగిలించి వెళ్ళిన చొక్కాను తీసి చూస్తే జేబులో ఒక జాబు మాత్రం ప్రత్యక్షమైంది. జలజ అనే ఆ అమ్మాయి ఎవరినైతే వలచిందో—అతడినే వరించడానికి వీలుగా తా నీ విధంగా పరారి కావలసి వచ్చిందన్నదే ఆ జాబులోని సారాంశం......"

కేసు విచారణకు ముందు రోజు హఠాత్తుగా బయలుదేర వలసివచ్చిన రావుగారు లాయరుతో ఏమయినదీ టెలిగ్రామ్ ఇవ్వమన్నాడు.

మర్నాడు, "ధర్మం జయించింది" అన్న తంతి వచ్చింది రావుగారి క్యాంప్‌కి.

"అయితే అప్పీలు కెళ్ళండి!" అని రావుగారు తిరిగి తంతి ఇచ్చారు.

వి. శర్మ (రాజోలు)

రైలు అవుటయినందుకు సూచనగా టంగు టంగున గంట మ్రోగింది.

జేబులోనుంచి పచ్చటి కాగితం పైకి తీశారు ఉమాపతిగారు. భట్టి విక్రమాదిత్యుల కథల్లో చీరలు, రవికలూ గూడా కథలు చెప్పడంలేదా సాత్యకీ! అలాగే చలపతి యింటినుంచి పరారీ చిత్తగించిన తర్వాత యిటీవలి అయిదేళ్ళల్లో జరిగిన కథను మనకీ ఉత్తరమే చెబుతుంది—" మళ్ళీ జబ్బా జేబులు తడవుకుంటూ, "కానైతే నేను నా కళ్ళద్దాలను యింటి దగ్గరే మరచిపోయి వచ్చినట్టున్నాను" అన్నారు ఉమాపతిగారు.

"మీ కళ్ళకు బదులు నా కళ్ళండీ మేష్టరుగారూ! గుడ్డి వెలుగులోనైనా నేను గుండుసూదిని కనిపెట్టగలను" అంటూ ఉత్తరం చేతికి తీసుకుని గడగడా చదువుకపోసాగాడు సాత్యకి.

"ప్రియమైన బావగారికి—

ఈ దస్తూరి ఎవరిదో గుర్తుందా బావా నీకు! ఉండకపోతే నేను ఆశ్చర్యపడను. చలపతి అన్న పేరుతో ఒక బావమరిదివుండేవాడు నీకు! వాడినే నేను!

మనిషిలోనూ మనసులోనూ వచ్చిన మార్పుల మూలంగా నువ్వివాడు నీ చలపతిని గుర్తించలేవు. ఎదుటబడి నోరు విడిచి నేనే చలపతినని చెప్పినా నమ్మలేవు.

ఇంటినుంచి పారిపోయినందుకు అయిదేళ్ళుగా అజ్ఞాతవాసం గడిపినందుకు ఈ జాబులో క్షమాపణలుగానీ, సంజాయిషీలుగానీ లేవు. వాటికోసం యిందులో అన్వేషించవద్దు!

ఇన్నేళ్ళ తర్వాత నేనొక మహత్తరమైన సత్యం తెలుసుకోగలిగాను.

—జీవితం అర్థంలేనిది!

అదొక వర్డ్ బిల్డింగ్ బాక్సులాంటి దనుకో బావా! అక్షరాలతో పదాలు కూర్చి ఆ పదాలతో ఒళ్ళు పులకరించే పద్యం అల్లి నడిమింటికి కట్టిన ఊహారజ్జువులకు ఆనందడోలను బిగించి దిగంతాల దాకా ఉల్లాసంగా ఊగేయాలన్నదే మానవుడి ప్రయత్నం.

పద్యం ప్రారంభమవుతుంది.

మధ్యలో 'మోదము' అన్న పదం కావలసి వస్తుం దనుకో బావా! ఎంత వెదికినా 'మో' కనిపించదు. దానికి బదులు 'ఖే' కనిపిస్తుంది.

ఖేదమే దక్కుతుంది.

ఐనా మానవుడు ఆశాజీవి.

'ఖేదము' అన్న పదం వచ్చినప్పటికీ పద్యంలోని భావం మారకుండా వుండాలన్నదే అతడి ఆశ.

అందుకోసం పద్యాన్ని మళ్ళీ ఆదినుంచీ మార్చ వలసి వస్తుంది.

పదాలను కూర్చి, పేర్చి, మార్చి లభించిన అక్షరాలతో ఉద్దేశించిన భావాన్ని ప్రకటించలేక ఖిన్నుడై పోతున్న మానవుడి ఆవేదనకు మారు పేరే జీవితం!

అందుకే చెబుతున్నాను—అర్థంలేనిది జీవితం.

జీవితానికే అర్థం కనిపించకపోగా యిక ఆదర్శాలకు నేనేమని అర్థం చెప్పగలను? మజ్జిగకే దోవ లేకపోతే యిక పెరుగుకు చీటీ గూడానా బావా!

ఈ జ్ఞానోదయం నాకు నిర్హేతుకంగా కలిగింది కాదు.

ఇందుకు కారణాలు చెబుతున్నాను—

నే నొక అమ్మాయిని పెళ్ళాడడానికి నిరాకరించాను. వేరొక అమ్మాయిని వలచి పొందలేకపోయాను. ఇంకొక అమ్మాయి వలపుకు అడ్డుగా నిలబడలేక యిలా పారిపోయి వచ్చేశాను.

సావిత్రి—అమృత—జలజ—ఆ ముగ్గురు యువతులు ఈనాడు వివాహితలు.

సావిత్రి తెంపరితనానికి కాణాచి అని నేననుకున్నాను. ఆమె విషయంలో నా ఊహ తారుమారైపోయింది. ఆమె ఈనాడు భర్తకు బహిః ప్రాణంగా వుంది. అతడివెంట ఆమె నరకం పొలిమేరలకైనా ఆనందంగా నడిచి వెళ్తుంది.

అమృత ముగ్గురు బిడ్డల తల్లి! ఆమె కీనాడు తన సంసారానికి మించిన స్వర్గమేలేదు. కాలగర్భంలో కలిసిపోయిన ఒకానొక భగ్నప్రేమికుడి విషాదగాథ ఆమెపాలిటి కొక పీడకల!

పై రెండింటికన్నా మహదాశ్చర్యకరమైన విషయం మరొకటివుంది. అదే జలజ సంగతి. ముచ్చట

టకి చేసుకున్న యువతితో ఆమె మొహమాటంలేనంత కాపురం చేసింది. నాటినుంచి నేటివరకూ పుట్టింటితోనే వుంది.

ఇవన్నీ ఈమధ్య నేను ఆరా తీసి తెలుసుకున్న విశేషాలు.

నాకొక టనిపిస్తుంది. ఇసుకదిబ్బలాంటి అదర్శాలపైన నిల్చుంటారు మానవులు. కాల ప్రవాహపు పురవడిలో యిసుక మేటలు కరిగి విరిగిపోతాయి. కాలుజారి, నీట కూలి మానవులు ప్రవాహంలో కొట్టుకపోతారు.

అనుభవాల గుణపాఠాలు నాకొక గొప్పనీతిని ఉపదేశించాయి—ప్రవాహానికి ఎదురీది లాభంలేదు.

అందుకనే నేనూ అందరిలాగా ఓ యింటివాణ్ణి కాదలచుకున్నాను.

అందచందాలు, విద్యావివేకాలు, గుణగణాలు — వీటిల్లో దేనిపట్లా పట్టింపులేదు నాకు ! ఓ కన్నెపిల్ల అయితే చాలు. పుస్తె కట్టడానికి నేను సిద్ధం.

ఇందులో స్నేహితు డొకడు నాకు తోడ్పడ్డాడు. అనంతపురంలో అతనికి బంధువు లున్నారు. ఆ బంధువులింట ఓ అమ్మాయి ఉంది. నాకైతే పిల్లను చూచుకోవాలని లేదు. కానీ వాళ్ళు మాత్రం తమ కుమార్తె పెళ్ళి విషయంలో లాటరీ వేయదలచుకోలేదట్లే ఉంది. అబ్బాయిని చూచిన తర్వాతగానీ మాట యివ్వలే మన్నారు.

బుధవారంనాటి సాయంకాలం బండిలో అనంతపురం వెళ్తున్నాను.

ఎంత చెడినా నేను నీకు బావమరిదిని! నీ అంతటివాడివి నువ్వుండగా పెళ్ళిచూపులకోసం ఒంటరిగా వెళ్ళవలసిన దురవస్థ నాకు పట్టదన్న నమ్మకంతో నాతోబాటుగా మా బావగారు గూడా రాబోతున్నారని అవతలివాళ్ళకు జాబు వ్రాశాను.

నా వేడికోలును మన్నించగలవని ఆశిస్తున్నాను.

ప్రస్తుతాని కివే విశేషాలు. మిగిలిన సంగతులు సమ్ముఖంలో చెప్పుకోగలను.

ఇట్లు
చలపతి."

సాత్యకి ఉత్తరం చదివి ముగించేసరికి చుట్టూరా కోలాహలం ప్రారంభమైంది. అంతలో యింజను దీపం వెలుగు వెల్లువలు ప్లాట్‌ఫారంపైకి పరతెంచి వచ్చేశాయి. రొప్పుకుంటూ, రోజుకుంటూ వచ్చి రైలు స్టేషనులో ఆగింది.

రైల్లో చలపతి గూడా రానే వచ్చాడు.

ఆరడుగుల బక్కపలచటివాడు చలపతి. పేర్వానీకి మల్లే కాలికి చుట్టుకున్న పంచకట్టు, ఆజాను పర్యంతంగా తొడుక్కున్న సన్నటి చొక్కా—యివి అతడి పొడుగరితనాన్ని ద్విగుణీకృతం చేసి చూపెడుతున్నాయి. పుల్లబడిపోతున్న తల వెంట్రుకల క్రింద నల్లబడిపోయిన అతడి కోల ముఖంకేసి చూస్తుంటే అతడు మనుషుల్లో మనిషిలా కలిసి నివసిస్తున్నట్టు లేడు. మండు టెండల్లో మాడుతూ, చలిగాలుల్లో వడకుతూ కొంతకాలం ఎడారి యిసుకపర్రల్లో నివసించి యిప్పుడిప్పుడే జనపదాల్లోకి తిరిగివచ్చిన మనిషిలా ఉన్నాడు. ఆ పాలకంలో చూపరులను ఇట్టే ఆకర్షించేవి అతడి కళ్ళు, మిణుగురుపుర్వుల్లాంటి ఆ చిన్న కళ్ళు పెద్ద చీకటింటి దీగుళ్ళలోని అముదపు దీపాల్లా వెలుగుతున్నాయి.

ఎక్కవలసిన రైలు

మామూలు కుశల ప్రశ్నలతో పరామర్శ పూర్తి కాగానే మెల్లగా ప్రారంభించారు ఉమాపతిగారు. "చూడు చలపతీ ! నా ఉద్యోగ మెలాటిదో నీకు తెలుసు. ఈరోజు ఉదయం నీ జాబు నాకు చేరింది. మూడు మాసాల క్రితమే నా కాజువల్ లీవుకు ఆయువు మూడింది. ఇప్పు డెంతగా గింజుకున్నా తిరే నాకొక రోజు తీరుబడి దొరకదు ..."

"ఇంతకూ నువ్వనే దేమిటి బావా ! నువ్వు నాతోగూడా అనంతపురం రావడంలేదన్నమాట ?" విస్మయంతో ప్రశ్నించాడు చలపతి.

"రాలేనందుకు విచారంగానే ఉంది చలపతీ ! అయినా నేను క్షంతవ్యుణ్ణే. అనంతపురం వెళ్ళడానికి నీ కిదే ప్రథమ మేమో ! అర్ధరాత్రి సమయంలో స్టేషనులో దిగి యెకాయెకిని గమ్యస్థానం చేరుకోడం గూడా కష్టమే ! ...."

"శష్య పరమాణువుని — నే నా ఊళ్ళో ఉండగా మీ కా దిగు లెందుకండీ మేష్టరుగారూ ! స్టేష

బంగారయ్యగారు అందరికీ ఆ రోజు మిఠాయి పంచి పెట్టారు. "మా అబ్బాయి తన మొదటి అయిదు రూపాయలు సంపాదించాడు. పోయిన మార్చిలో బి. ఏ. పాసయినందు కిచ్చిన ఉంగరం అమ్మేశాడు" అని గొప్ప చెప్పుకున్నాడు.

బి. రాజేంద్రప్రసాద్, (విజయవాడ)

నులో దిగినప్పటినుంచీ చలపతిగారు నా కతిథిగా ఉంటారు ...." అన్నాడు సాత్యకి.

"ఏమి టేమిటి ! నువ్వుద్యోగం చేస్తున్నది అనంతపురంలోనా సాత్యకీ ! — ఇంకేం, నువ్వు నిక్షేపంలా వెళ్ళిరావచ్చు చలపతీ ! అక్కడ నీ అవసరాలన్నీ సాత్యకి చక్కగా గమనిస్తాడు. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రా" అన్నారు ఉమాపతిగారు.

తరువాత పది నిముషాలకు చలపతిని, సాత్యకిని ఎక్కించుకున్న రైలు మళ్ళీ మునుపటిలా రభసం చేసుకుంటూ చీకటిలోకి దూసుకపోయింది.

* * *

వేసవి సెలవుల్లో బంధువుల ఊళ్ళన్నీ దర్శించి యింటికి తిరిగి వచ్చేసరికి కిటికీగుండా గదిలో పడివున్న పెళ్ళి పత్రిక ఒకటి కనిపించింది. విప్పి చూడగానే పెద్దక్షరాలలో వరుడి పేరు దృగ్గోచరమైంది. ఒకటి రెండు క్షణాలపాటు నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. మరెవరో కాదు— సాత్యకికే పెళ్ళి !

ఈ విచిత్రం ఎలా సంఘటించింది ? ఎంతో సాలోచించినా జవాబు స్ఫురించింది కాదు. ఏదైనా ఫ్లాష్ తొలకవచ్చునని మళ్ళీ ఒకసారి పత్రికను పరకాయించి చూచాను. వధువు పేరు నిర్మల. వివాహం అనంతపురంలో కన్యాదాత స్వగృహంలో జరుగుతుంది.

ఎలాగైనా అదృష్టవంతుడు సాత్యకి. తంతే వెళ్ళి గారెల బుట్టలో పడినట్టు వాడికి ఉద్యోగం చేస్తున్న ఊళ్ళోనే అత్తగారిల్లు దొరికింది. వివాహానంతరం హోటలు భోజనానికి స్వస్తిచెప్పి వాడు హాయిగా అత్తగారింటిలోనే మకాం పెట్టవచ్చు....

ఆరోజు సాయంత్రం హఠాత్తుగా బజారులో ఎదురయ్యారు ఉమాపతిగారు. తొందరగా ఎక్కడికో వెళ్తుండగా నా చేతిని ఒడిసి పట్టుకుని వెనక్కు లాగుతూ "డామిట్ ! కథ అడ్డం తిరిగింది" అన్నారు.

"ఏమిటండీ మేష్టరుగారూ ! ఎవరి కథ ?" అన్నాను.

"మరెవరి కథ ? మా చలపతిగాడి కథే! వాడిలో చింత చచ్చినా పులుసు చావలేదయ్యా శేఖరం !" ఆయన జాలిగా అన్నారు.

తెల్లబోయి ఆయనవైపు చూడడం తప్పితే నేను మరేమీ మాట్లాడలేకపోయాను.

"ఇంతదూరం ఒంటరిగా వచ్చినవాడు ఆ పెళ్ళిచూపులకు గూడా ఒంటరిగానే వెళ్ళగూడదా శేఖరం ? ఊహూ, సాత్యకిని వెంటబెట్టుకుని వెళ్ళాడు. వెళ్ళగా ఏమైంది ? వాళ్ళు సాత్యకినే వరుడనుకున్నారు. చలపతిని అబ్బాయికి తోడుగా వచ్చిన బంధువనుకున్నారు. సాత్యకి మొగమాటమూ చలపతి అభిమానమూ ఆ అపోహ నలాగే పెరిగిపోనిచ్చాయి. తీరా వీడ్కోలు సమయంలో సాత్యకి సంబోధన ద్వారా చలపతి ఎవరో, సాత్యకి ఎవరో తేలిపోయింది. తేలిపోగానే అవతలివాళ్ళ ముఖాలు వెలవెలపోయాయి. కిక్కురుమనకుండా బెంగుళూరుకు వెళ్ళిపోయాడు చలపతి. వెళ్ళగానే— తగుదునమ్మా అని పెళ్ళిచూపులకోసం వెళ్ళినందుకు సిగ్గుపడుతున్నాను బావా ! ముదిరిన బెండకాయ కూరకు పనికిరాదని తేలిపోయింది— అంటూ నాకొక ఉత్తరం వ్రాసి పారేశాడు ...."

"అలాగైతే యిప్పుడు సాత్యకికి కుదిరిన సంబంధం ...."

అర్థోక్తిలో ఆగిపోయిన నా వాక్యాన్ని ఉమాపతిగారే పూర్తి చేశారు. "అక్షరాలా అదే సంబంధం! పాపం సాత్యకి తన పట్టుదలను సడలించుకోడంలో మాత్రం అబ్బుర మేముంది శేఖరం ? మొన్న శ్రీకంఠంగారు కనపడి చెప్పారు—అమ్మాయి ఆణిముత్యంలా ఉందట ! చిదిమి దీపం పెట్టుకోవచ్చునట ! .... కానీ నా కొకందుకు విచారంగా ఉంది శేఖరం ! చలపతికి ఈ చిట్టచివరి రైలు గూడా తప్పిపోయింది...." బరువుగా నిట్టూర్పు విగుడించారు ఉమాపతిగారు.

నిజమే ! ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ఆదర్శాల లగేజీ వదిలించుకోగలిగినవాడికి మాత్రమే రైలందుతుంది. అలా వదిలించుకోలేక ఓపినంత లగేజీని తలపైన వేసుకుని ఆ బరువుతో కృంగిపోయేవాళ్ళకు వాళ్ళెప్పుడు లేచినా రాళ్ళవంక దగ్గరే తెల్లవారుతుంది. అలాంటివాళ్ళ విషయంలో వాళ్ళెక్కదలచుకున్న రైలు పూర్తిగా ఒక జీవితకాలం లేటైపోయినా అందులో ఆశ్చర్యపడవలసింది ఏముంటుంది ?